ప్రభాత
ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 361 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శుక్రవారం 10 ఏప్రిల్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# మాజీ మంత్రి జీవన్ రెడ్డితో కేటీఆర్ భేటీ

**బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించిన కేటీఆర్**

**ఇటీవల కాంగ్రెస్‌కు జీవన్ రెడ్డి రాజీనామా**



**జగిత్యాల, ఏప్రిల్ 9 (ప్రభాత ఉదయం)**

మాజీమంత్రి జీవన్‌రెడ్డిని బీఆర్ఎస్‌లో చేరాలని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కోరారు. అంతకుముందు పార్టీ నేతలతో కలిసి జగిత్యాలలోని జీవన్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. కాసేపు సరదాగా మాట్లాడుతూ ఇరువురు యోగక్షేమాలు తెలుసుకున్నారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఉన్నారు.

పార్టీలోకి ఆహ్వానిచేందుకు ఇక్కడికి వచ్చాం : కేటీఆర్ జీవన్ రెడ్డితో సమావేశమైన అనంతరం మీడియాతో మాట్లాడారు. జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించామన్న కేటీఆర్ 4 దశాబ్దాలకు పైగా జీవన్ రెడ్డి కాంగ్రెస్ ద్వారా ప్రజలకు సేవ చేశారని కొనియాడారు. గతంలో జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించడం జరిగిందని, కానీ కాంగ్రెస్‌తో వారికున్న అనుబంధంతో అక్కడే ఉన్నారని గుర్తు చేశారు. కేసీఆర్ తరపున పార్టీలోకి ఆహ్వానిచేందుకు ఇక్కడికి వచ్చామని, రెండురోజుల్లో కేసీఆర్‌ను కలిసి మాట్లాడతా అని జీవన్ రెడ్డి చెప్పారని, తిరిగి కేసీఆర్ సీఎం కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

అధికారం ఎవ్వరికి శాశ్వతం కాదు : మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, జీవన్ రెడ్డి మధ్య నాలుగు దశాబ్ధాలకు పైగా స్నేహం ఉందని కేటీఆర్ గుర్తు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తొలిసారిగా జరిగిన సమీక్ష సమావేశంలో జీవన్ రెడ్డికి మాట్లాడేందుకు అవకాశం ఇచ్చారని, బోర్నపల్లి బ్రిడ్జి కోసం రూ.75 కోట్లను జీవన్ రెడ్డి అడిగిన వెంటనే అనుమతి ఇచ్చారని

..మిగతా 2లో



## రేవంత్ కన్నా... కెసిఆర్ పాలనే బెటర్

**నష్టపోయిన ప్రతి రైతును ఆదుకున్న కెసిఆర్**

**తెలంగాణ ఏర్పాటు కెసిఆర్ వల్లనే సాకారమయ్యింది**

**జాయతీయ స్థాయిలో బిజెపి..రాష్ట్రంలో కెసిఆర్ బెటర్**

**కాంగ్రెస్ పాలన చూశాక బిఆర్ఎస్ నయమన్న భావనలో ప్రజలు**

**మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

**బిఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటన**

**జగిత్యాల, ఏప్రిల్ 9 (ప్రభాత ఉదయం)**

రేవంత్ రెడ్డి పాలన కంటే కేసీఆర్ పాలన బాగుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను త్వరలోనే బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్నట్లు స్పష్టం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... నష్టపోయిన ప్రతి రైతును గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదుకుందని ప్రశంసించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతోందని విమర్శించారు. ఉద్యోగులు, నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ప్రజలు ఆశించిన పాలన రాలేదని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. రేవంత్ పాలన చూసిన తర్వాత కేసీఆర్ పాలనే బాగుందని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. జాతీయ స్థాయిలో బీజేపీ బెటర్ అని.. రాష్ట్ర స్థాయిలో కేసీఆర్ మెరుగైన నాయకుడని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కేసీఆర్ వల్లే సాధ్యమైందని గుర్తు

..మిగతా 2లో

## 2021 సీన్ మళ్లీ రిపీట్

**మమత ఓటమి ఖాయం: ప్రధాని మోదీ**

**త్వరలో బంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు-**

**ఈ క్రమంలో పశ్చిమ మేధినీపుర్‌లో జరిగిన**

**బహిరంగ సభలో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ-**

**భవానీపుర్‌లో బంగాల్ సీఎం మమతా బెనర్జీ ఓడిపోతారని జోస్యం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 (ప్రభాత ఉదయం)**



ఐదేళ్ల క్రితం నందిగ్రామ్‌లో వచ్చిన ఫలితమే ఈసారి భవానీపుర్‌లోనూ పునరావృతమవుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అలాగే త్వరలో జరగబోయే ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా అదే సీన్ రిపీట్ అవుతుందన్నారు. 2021లో నందిగ్రామ్‌లో బంగాల్ సీఎం మమతా బెనర్జీపై బీజేపీ నేత సువేందు అధికారి సాధించిన విజయాన్ని

..మిగతా 2లో

## జీవన్ రెడ్డిపై మహేశ్ కుమార్ గౌడ్ అసహనం

**ముఖ్యమంత్రిపై జీవన్ రెడ్డి విమర్శలను తప్పుబట్టిన టీపీసీసీ చీఫ్**

**ఎమ్మెల్యేలందరూ కలిసి ఆయనను సీఎంగా ఎన్నుకున్నారని వెల్లడి**

**బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు భవిష్యత్తులో కలిసిపోతాయని జోస్యం**



**హైదరాబాద్, ఏప్రిల్ 9 (ప్రభాత ఉదయం)**

మాజీ మంత్రి జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్న సందర్భంగా ఈ విషయంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసిందని ప్రస్తావించారు. ఆయనకు ఉన్నతమైన గౌరవం ఇచ్చిందన్నారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ 14 సార్లు బీ ఫాం ఇచ్చిందని గుర్తుచేశారు. గురువారం గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. ప్రజలు ఎన్నుకున్న నేత సీఎం రేవంత్‌రెడ్డి అని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి పోవాలి.. మార్పు రావాలి అనడానికి జీవన్ రెడ్డి ఎవరు..? అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో జరిగిన అవినీతి గురించి అనేక సార్లు జీవన్ రెడ్డి విమర్శించారని మహేశ్ కుమార్ గౌడ్ ప్రస్తావించారు. వాటిని మరచి ఇవాళ జీవన్ రెడ్డి మాట్లాడడం సరికాదన్నారు. ఆయనకు

..మిగతా 2లో

## కాళేశ్వరం బ్యారేజీల మరమ్మతులు త్వరగా పూర్తిచేయాలి

**సీఎం రేవంత్**

**హైదరాబాద్, ఏప్రిల్ 9 (ప్రభాత ఉదయం)**



కాళేశ్వరం ప్రాజెక్టులోని 3 బ్యారేజీలకు మరమ్మతులను త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు పనులు పూర్తిచేయాలని అధికారులకు ఆయన సూచించారు. కాళేశ్వరం మరమ్మతులపై నీటి పారుదలశాఖ ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు

..మిగతా 2లో



## శాంతియుత నిరసనలతో ఖండించాలి

**వ్యతిరేక వార్తలు వస్తే దాడులు చేయడం సరికాదు**

**మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

**చిత్తూరు,ఏప్రిల్9 (ప్రభాత ఉదయం)**

పత్రికల్లో, మీడియాల్లో ఏమైనా అసత్య ప్రసారాలు వస్తే వాటిపైన శాంతియుతంగా నిరసనలు తెలిపే హక్కు ఉందని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. అలాగే వాటికి ఖండనలు ఇచ్చి తమ నిరసనలు తెలప వచ్చన్నారు. అలా కాకుండా మీడియాపై భౌతిక దాడులకు పాల్పడటం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. మీడియా స్వేచ్ఛకు విఘాతం కల్పించే చర్యలకు పాల్పడటం ఏ రాజకీయ పార్టీలకైనా తగదని అన్నారు. పత్రికా స్వేచ్ఛపై భౌతిక దాడులకు పాల్పడితే ఏ రాజకీయ పార్టీ అయినా సరే ఆ చర్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. గురువారం చిత్తూరులోని ఎస్పీ సావిత్రమ్మ ప్రభుత్వ

..మిగతా 2లో



## కాల్పుల విరమణ.. రాజకీయ వైఫల్యం

**నెతన్యాహూకు స్వదేశంలో తీవ్ర వ్యతిరేకత**

**ప్రధాన ప్రతిపక్ష నాయకుడు యైర్ లాపిడ్ విమర్శలు**

**టెలిఅవీవ్,ఏప్రిల్9 (ప్రభాత ఉదయం)**

యుద్ధ లక్ష్యాలను సాధించడంలో ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు విఫలమయ్యారని ఇజ్రాయెల్ ప్రతిపక్ష నాయకులు విమర్శలు గుప్పించారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని తీవ్రంగా విమర్శించారు. ఇజ్రాయెల్

..మిగతా 2లో

## జూన్ 2 నుంచి విద్యార్థులకు అల్పాహార పథకం



2లో..

**జూన్ 2 నుంచి అల్పాహార పథకం పునరుద్ధరణ**

**ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం విస్తరణ**

**'యంగ్ ఇండియా' రెసిడెన్షియల్ స్కూల్స్‌కు శ్రీకారం**

**విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యం: భట్టి విక్రమార్క**

# 2021 సీన్ మళ్లీ రిపీట్





**మొదటి పేజీ తరువాయి...**
ఈ సందర్భంగా మోదీ ప్రస్తావించారు. బంగాల్ యువతకు టీఎంసీ ప్రభుత్వం చేసిన ద్రోహం వందేళ్లయినా సరే ఆ పార్టీ కడిగేసుకోలేదన్నారు. బంగాల్‌లోని పశ్చిమ మేధినీపుర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఈ మేరకు మోదీ వ్యాఖ్యానించారు.

"బంగాల్‌లో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు సాధారణమైనవి కావు. ఈ ఎన్నికలు బంగాల్ వైభవాన్ని పునరుద్ధరించేవి. వికసిత్ బంగాల్‌కు పునాదులను బలోపేతం చేసేవి. ఆ దిశగా సాగేందుకు రాష్ట్ర ప్రజలు వేయాల్సిన మొట్టమొదటి అడుగు ఈ నిర్దాక్షిణ్య టీఎంసీ ప్రభుత్వానికి గద్దె దించడమే. దేశంలోని అనేక రాష్ట్రాలు అభివృద్ధి పథంలో పయనిస్తుండగా, టీఎంసీ ప్రభుత్వం మాత్రం బంగాల్‌ను వెనక్కి లాగుతోంది. ఈసారి బంగాల్ ప్రజలు ఎటువంటి ప్రతికూల పరిస్థితులనైనా అధిగమించాలని సంకల్పించారు. ఈ ఉత్సాహంలోనే బీజేపీ విజయం కనిపిస్తోంది. బంగాల్ యువతకు టీఎంసీ ద్రోహం చేసింది. ఇక్కడ ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు లేవు. ఒకవేళ ఉన్నా వాటిని చొరబాటుదారులకు కట్టబెట్టారు. ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలను టీఎంసీ మంత్రులే దోచుకుంటున్నారు" అని మోదీ తెలిపారు.

**టీఎంసీని అధికారం నుంచి గద్దె దించండి : ప్రజలకు మోదీ పిలుపు**

ఒకప్పుడు దేశం నలుమూలల నుంచి ప్రజలు ఉపాధి కోసం హల్దియాకు వచ్చేవారని, కానీ నేడు ఇదే ప్రాంతానికి చెందిన యువత అండమాన్‌కు, ఒడిశాకు వలస వెళున్నారని ప్రధాని మోదీ తెలిపారు. ఉద్యోగాల వేటలో బంగాల్ వాసులు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్తున్నారని అన్నారు. టీఎంసీ ప్రభుత్వం హయాంలో నిజంగా వృద్ధి చెందిన ఏకైక విషయం ఏమిటంటే చొరబాట్లేనని ఎద్దేవా చేశారు. నకిలీ పత్రాల తయారీకి, పశువుల అక్రమ రవాణాకు టీఎంసీ ఒక వేదికగా మారిందని ఆరోపించారు. బంగాల్‌లో అధికారంలో ఉన్న మమతా బెనర్జీ ప్రభుత్వం దుష్పరిపాలన చేస్తోందని విమర్శించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీని అధికారం నుంచి గద్దె దించాలని పిలుపునిచ్చారు.

"దేశం ప్రగతి పథంలో నడుస్తుండగా, టీఎంసీ 'నిర్మమ్ సర్కార్' (క్రూరమైన ప్రభుత్వం) బంగాల్‌ను వెనక్కి లాగుతోంది. బంగాల్‌ను విజయపథంలో చూడాలంటే టీఎంసీని అధికారం దించడం అత్యవసరం. ప్రైవేట్ రంగాన్ని నాశనం చేయడం, డబ్బు కోసం ప్రభుత్వ పదవులను దోచుకోవడం వంటి రెండు విధాలుగా టీఎంసీ బంగాల్ యువతను మోసం చేసింది. తన ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి టీఎంసీ మత ఆధారిత రిజర్వేషన్ విధానాన్ని అనుసరిస్తోంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ ఈ సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరు కావడం బంగాల్‌లో మార్పునకు సూచిక. టీఎంసీ పతనానికి సంకేతం."

**--నరేంద్ర మోదీ, భారత ప్రధాని**

డబుల్ ఇంజిన్ సర్కార్ బంగాల్‌ను మత్స్య పరిశ్రమ, సముద్ర ఆహార రంగాలలో స్వయం సమృద్ధిగా మారుస్తుందని మోదీ హామీ ఇచ్చారు. మత్స్య పరిశ్రమ కోసం బీజేపీ ప్రత్యేకంగా ఒక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. అలాగే మత్స్యకారుల సంక్షేమం కోసం రికార్డు స్థాయిలో బడ్జెట్‌లో కేటాయింపులు చేసిందన్నారు. అంతేకాకుండా, మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డ్ సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఎక్కడైతే ఎన్‌డీఏ అధికారంలో ఉంటుందో అక్కడ చేపల ఉత్పత్తిలో వేగవంతమైన వృద్ధి కనిపిస్తోందని తెలిపారు.

PM అనే పదం పట్ల టీఎంసీకి ఎందుకంత ద్వేషం'

"ప్రధానిని వ్యతిరేకించడం వల్ల రాష్ట్రానికి ప్రయోజనం చేకూరదు. ప్రధాని, ముఖ్యమంత్రి ఇద్దరూ ఏకతాటిపై పనిచేసినప్పుడే లాభపడుతుంది. అందుకే బంగాల్‌కు డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అవసరం. టీఎంసీకి 'పీఎం' అనే పదం పట్ల ఎందుకంత తీవ్రమైన ద్వేషం. ఆ పదంతో ముడిపడి ఉన్న ప్రతి పథకం పేరును వారు మార్చేశారు. లేదంటే ఆ పథకాలను రాష్ట్రంలో అమలు చేయడానికే నిరాకరించారు. 'పీఎం ఆవాస్ యోజన'అనేది పేదలకు ఇళ్ల మంజూరు కోసం రూపొందించిన పథకం అయినప్పటికీ వారు దాని పేరును మార్చేశారు. అదే విధంగా ఆయుష్మాన్ భారత్ (పీఎం జన ఆరోగ్య యోజన) అనే పథకంలో కూడా పీఎం ఉందనే ఏకైక కారణంతో టీఎంసీ సర్కార్ ఆ పథకాన్ని బంగాల్‌లో అమలు చేయడానికి అనుమతించడం లేదు. పీఎం అనేది ప్రజలు ఇచ్చిన పదం. ఇది నేను పుట్టుకతోనే నా వెంట తెచ్చుకున్నది కాదు. దీనివల్ల నష్టపోతున్నది బంగాల్‌లోని పేద ప్రజలు, వృద్ధులు" అని మోదీ పేర్కొన్నారు.

### కాళేశ్వరం బ్యారేజీల మరమ్మతులు

# త్వరగా పూర్తిచేయాలి



**మొదటి పేజీ తరువాయి...**
సమావేశానికి హాజరయ్యారు. "బ్యారేజీల మరమ్మతులకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. వీలైనంత త్వరగా పనులు వేగవంతం చేయాలి. ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలి. ఏజెన్సీలన్నింటినీ అప్రమత్తం చేసి పనుల్లో వేగం పెంచాలి. వర్షాకాలానికి ముందే పరీక్షలు, నమూనాల సేకరణ పూర్తి చేయాలి. సీడబ్ల్యూపీఆర్ఎస్, బ్యారేజీల నిర్మాణ సంస్థలు, నీటిపారుదలశాఖ, డిజైన్ కన్సల్టేషన్స్‌తో బృందం ఏర్పాటు చేయాలి. ప్రతి పనిలో సీడబ్ల్యూసీ సభ్యులు ఉండేలా చూడాలి. బ్యారేజీల మరమ్మతులకు సంబంధించి డిజైన్‌లు, డిసెంబర్‌లోపు చేయాల్సిన పనులపై పూర్తి షెడ్యూల్ సిద్ధం చేయాలి. నిధుల కొరత రానివ్వం.. పనుల్లో జాప్యం జరగడానికి వీల్లేదు. మేడిగడ్డ వద్ద బేస్ క్యాంపులు ఏర్పాటు చేయాలి. పనులు ప్రారంభమయ్యాక స్వయంగా వచ్చి పరిశీలిస్తా"అని సీఎం అన్నారు.

# రేవంత్ కన్నా... కెసిఆర్ పాలనే బెటర్

**మొదటి పేజీ తరువాయి...**

చేశారు. జీవన్ రెడ్డి వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇదిలావుంటే 13న జగిత్యాలలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందని సమాచారం. కేటీఆర్ జగిత్యాలలో జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి పార్టీలోకి అధికారికంగా ఆహ్వానించనున్నారు. జీవన్ రెడ్డి గతంలో కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడిగా, మంత్రిగా పని చేశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్ నుంచి జగిత్యాలకు బయల్దేరారు. ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డిని ఆయన నివాసంలో కలవనున్నారు. ఈ సందర్భంగా జగిత్యాల శివారులో బీఆర్ఎస్ శ్రేణులు కేటీఆర్‌కు స్వాగతం పలకున్నాయి. అక్కడి నుంచి బైక్ ర్యాలీతో జీవన్ రెడ్డి నివాసానికి రానున్నారు. కేటీఆర్ రాకతో జీవన్ రెడ్డి నివాసంతో పాటు జగిత్యాల పట్టణం గులాబీమయంగా మారింది. కాగా,



కేటీఆర్‌తో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కీలక నాయకులు సైతం జీవన్‌రెడ్డి ఇంటికి రానున్నారు. రాష్ట్ర రాజకీయాలపై చర్చించిన అనంతరం ఆయనను పార్టీలోకి లాంఛనంగా కేటీఆర్ ఆహ్వానించనున్నారు. 1984లో కాంగ్రెస్ పార్టీలో చేరిన జీవన్‌రెడ్డి నలభై మూడేండ్లుగా ఉత్తర తెలంగాణలోనే కీలకమైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జీవన్‌రెడ్డి మూడుసార్లు రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 2014లో తెలంగాణ అవతరించిన తర్వాత ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏకైక ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. 2018లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలైన జీవన్‌రెడ్డి 2019లో పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలిచి శాసన మండలిలో ఏకైక కాంగ్రెస్ సభ్యుడిగా కొనసాగారు. జగిత్యాల నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ సంజయ్‌కుమార్‌ను సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలో చేర్చుకోవడంతో జీవన్‌రెడ్డి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. జీవన్‌రెడ్డి వర్గానికి ప్రాధాన్యత తగ్గిపోవడం, నామినేటెడ్ పదవుల కోసం ప్రతిపాదించిన వారికి పదవులను ఇవ్వకుండా ఎమ్మెల్యే సూచించిన వ్యక్తులకు ఇవ్వడం, ప్రధాన

అనుచరుల్లో ఒకరు దారుణహత్యకు గురికావడంతో జీవన్‌రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో జగిత్యాల, రాయికల్ పట్టణాల్లో జీవన్‌రెడ్డి వర్గానికి చెందిన వారిని కాంగ్రెస్ పక్కన పెట్టడంతో తీవ్ర ఆవేదనకు లోనైన జీవన్‌రెడ్డి గత నెల 25న కార్యకర్తలు, నాయకుల సమక్షంలో కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు.

# జూన్ 2 నుంచి విద్యార్థులకు అల్పాహార పథకం

**జూన్ 2 నుంచి అల్పాహార పథకం పునరుద్ధరణ**

**ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం విస్తరణ**

**'యంగ్ ఇండియా' రెసిడెన్షియల్ స్కూల్స్‌కు శ్రీకారం**

**విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యం: భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, ఏప్రిల్ 9 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు అక్షరజ్ఞానం, నాణ్యమైన విద్యపైనే ఆధారపడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లాలోని బోనకల్ , ఎర్రుపాలెం మండలాల్లో పర్యటించిన ఆయన, విద్యా రంగంలో ప్రభుత్వం తీసుకురాబోతున్న విప్లవాత్మక మార్పుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పదేళ్ల పాలనలో రాష్ట్ర వనరులు విపరీతంగా దోపిడీకి గురికావడం వల్ల తెలంగాణ ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేకపోయిందని విమర్శించారు.



వనరుల దోపిడీని అరికట్టి, ఆ సంపదను ప్రజల ప్రయోజనాల కోసం, ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం వెచ్చిస్తామని ఆయన హామీ ఇచ్చారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు నూతన పథకాలను ప్రకటించింది. జూన్ 2 నుంచి పాఠశాల విద్యార్థులందరికీ అల్పాహార పథకాన్ని పునరుద్ధరిస్తున్నట్లు భట్టి వెల్లడించారు. అలాగే, ఇప్పటివరకు కేవలం పాఠశాలలకే పరిమితమైన మధ్యాహ్న భోజన పథకాన్ని ఇకపై ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. "అక్షరమే ఆయుధంగా ప్రతి విద్యార్థి ప్రపంచంతో పోటీపడేలా ఎదగాలి" అని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ప్రతి బిడ్డకు ఉచితంగా, అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

రాష్ట్రవ్యాప్తంగా విద్యా ప్రమాణాలను పెంచేందుకు 100 'యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్' ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు ఉప ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ స్కూల్స్ ద్వారా అంతర్జాతీయ స్థాయి వసతులు, బోధన అందుబాటులోకి వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం భవనాల నిర్మాణమే కాకుండా, విద్యార్థులకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తూ, విద్యను సామాన్యుడికి చేరువ చేస్తామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు , అధికారులు పాల్గొన్నారు.



# మాజీ మంత్రి జీవన్ రెడ్డితో కేటీఆర్ భేటీ

**మొదటి పేజీ తరువాయి...**
తెలిపారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపించేందుకు జీవన్ రెడ్డి చేసిన పోరాటం అప్పటి ప్రభుత్వం గుర్తించిందన్నారు. పార్టీ బలోపేతం కోసం జీవన్ రెడ్డి చేరిక కోసం జగిత్యాల పార్టీ నేతలంతా ముందుకొచ్చారని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలు విసుగు చెంది ఉన్నారని, 3 దఫాలుగా 27 వేల కోట్ల రైతు భరోసా ఎగ్గొట్టారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అపసవ్యపు మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి భాష పట్ల జనాల్లో చర్చ జరుగుతోందని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్నారు.

ఎమ్మెల్యే సంజయ్‌ని కాంగ్రెస్‌లో చేర్చుకోవడంతో : ఇటీవల జీవన్‌రెడ్డి తన అనుచరుల సమక్షంలో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. జగిత్యాలలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి డాక్టర్ సంజయ్ గెలిచారు. అప్పటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. దీంతో ఆయన అధికార పార్టీతో కలిసి పని చేస్తానని బహిరంగంగా వెల్లడించారు. అక్కడే కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన జీవన్ రెడ్డి ఓటమి చెందడం, ఆయనకు సమాచారం లేకుండా ఎమ్మెల్యే సంజయ్‌ని కాంగ్రెస్‌లో చేర్చుకోవడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై కాంగ్రెస్ అధిష్టానం పలుమార్లు నచ్చజెప్పింది. సంతృప్తి చెందని ఆయన రాజీనామా చేశారు.

# జీవన్ రెడ్డిపై మహేశ్ కుమార్ గౌడ్ అసహనం

**మొదటి పేజీ తరువాయి...**

ఇష్టం లేకపోతే చేసేదేమీ లేదని, కానీ విమర్శలకు కూడా ఓ హద్దు ఉండాలని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై వస్తున్న ఆరోపణలపై మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. పొంగులేటి అవినీతిపై ఆధారాలు ఉంటే చర్చకు రావాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ఆధారాలు చూపిస్తే చర్యలు తప్పకుండా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆధారాలు ఉంటే పట్టుకొని గాంధీ భవన్‌లో చర్చకు రావాలని సవాల్ విసిరారు. బట్ట కాల్చి మీద వేస్తామంటే కుదరదని హెచ్చరించారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో అప్పటి మంత్రులు చాలా దోచుకున్నారని ఆరోపించారు. జేబులు నింపుకొని ఈరోజు తమ మంత్రులపై విమర్శలు చేస్తారా? అని ఆగ్రహించారు. ఆనాటి దోపిడీ గురించి కేసీఆర్ కూతురు కవిత చెబుతోందన్నారు. కేసీఆర్ హయాంలో నాసిరకం ప్రాజెక్టులు కట్టి డబ్బులు దోచుకున్నారని మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు.

### కాల్పుల విరమణ..

# రాజకీయ వైఫల్యం

**మొదటి పేజీ తరువాయి...**

ప్రధాన ప్రతిపక్ష నాయకుడు యైర్ లాపిడ్.. కాల్పుల విరమణ ఒప్పందాన్ని, ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ఆక్షేపించారు. ఇరాన్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని రాజకీయ వైఫల్యంగా అభివర్ణించారు. యుద్ధ లక్ష్యాలను సాధించడంలో నెతన్యాహు తీవ్రంగా విఫలమయ్యారని, ఆయన తీసుకున్న నిర్ణయాలు దేశ భద్రతకు ప్రమాదకరమని యైర్ లాపిడ్ పేర్కొన్నారు. 'మన చరిత్రలో ఇంతటి రాజకీయ విపత్తు ఎన్నడూ జరగలేదు. అహంకారం, నిర్లక్ష్యం, వ్యూహాత్మక ప్రణాళిక లేకపోవడం వల్ల నెతన్యాహు కలిగించిన రాజకీయ, వ్యూహాత్మక నష్టాన్ని పూడ్చడానికి మనకు సంవత్సరాలు పడుతుంది' అని ట్వీట్ చేశారు. సైన్యం తమకు అప్పగించిన పనులన్నీ పూర్తి చేసిందని, ప్రజలు కూడా అద్భుతమైన స్థైర్యాన్ని ప్రదర్శించారని, అయితే నెతన్యాహు రాజకీయంగా, వ్యూహాత్మకంగా విఫలమయ్యారని విమర్శించారు. తాను నిర్దేశిరచుకున్న లక్ష్యాలలో దేనినీ నెతన్యాహు సాధించలేకపోయారన్నారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిర్మూలించడం లేదా తీవ్రంగా దెబ్బతీయడాన్ని నెతన్యాహు యుద్ధానికి ప్రధాన లక్ష్యంగా నిర్దేశిరచారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని

ఇజ్రాయెల్‌కు అస్తిత్వ ముప్పుగా అభివర్ణించారు. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి సామర్థ్యాలను నిర్వీర్యం చేయాలని, ఇరాన్ పాలనను బలహీనపరచాలని, దాని మిత్ర బృందాల నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకోవాలని నెతన్యాహు లక్ష్యాలుగా పెట్టుకున్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడంలో నెతన్యాహు దారుణంగా విఫలమయ్యారని మాజీ ప్రధాని నాఫ్తాలి బెన్నెట్ విమర్శించారు. 'నాయకత్వం మనకు భ్రమలు కల్పించింది. వారి వాగ్దానాలన్నీ ఈ రాత్రి మన మొహం మీదే పేలిపోయాయి' అని బెన్నెట్ ట్వీట్ చేశారు. ఈ ఒప్పందం రాబోయే సంవత్సరాల పాటు ఇజ్రాయెల్ భద్రతను ప్రమాదంలో పడేసే ఒక సంపూర్ణ వైఫల్యం అని అభివర్ణించారు.

### శాంతియుత నిరసనలతో

# ఖండించాలి

**మొదటి పేజీ తరువాయి...**
మహిళ కళాశాల స్నాతకోత్సవానికి వెంకయ్య నాయుడు హాజరయ్యారు. కళాశాల ఆవరణలో చిత్తూరు మాజీ ఎంపీ చంగల్రాయ నాయుడు సహకారంతో నూతనంగా నిర్మించిన మహిళ వసతి భవనానికి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడారు. మాతృభాషను మరిస్తే అమ్మను మరిచినట్లేనని వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. జన్మనిచ్చిన తల్లి ఊరు, దేశాన్ని ఎవరు మరువకూడదని చెప్పుకొచ్చారు. విద్యార్థులు యువత సోషల్ మీడియా ఊబిలో పడవద్దని సూచించారు. మనిషి జీవన ప్రమాణం మెరుగుపడాలంటే అందుకు అనుగుణంగా ఆహారపు అలవాట్లను కొనసాగించడం మంచిదని అన్నారు. విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం చదువుతోపాటు ఆటలకు ఇవ్వాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆరోగ్యం కోసం తీసుకువచ్చిన యోగా కార్యక్రమాన్ని ప్రపంచ దేశాలు స్వాగతించాయని.. అమలు చేయడానికి శ్రీకారం చుట్టాయని ప్రస్తావించారు. తాను రాజకీయ వారసత్వానికి వ్యతిరేకినని.. కానీ సేవా కార్యక్రమాలు కొనసాగించే కుటుంబాల వారసత్వాన్ని ప్రోత్సహిస్తానని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

# పేదల కోసం పోరాడే పార్టీ సీపీఐ పార్టీ : పుస్తకాల నర్సింగ్ రావు





మైలార్ దేవుపల్లి లో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు


విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

**బుద్వేల్, ఏప్రిల్ 9 (ప్రభాత ఉదయం)**

పేదలు, తాడిత, పీడిత వర్గాల ప్రజల కోసం 100 సం వత్సరాలుగా పోరాడుతున్న పార్టీ సీపీఐ పార్టీ అని తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు, పార్టీ రం గారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్ రావు అన్నారు. ఇంటింటికి సీపీఐ కార్యక్రమంలో బాగం గా గురువారం సీపీఐ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో మైలార్దేవుపల్లిలోని పలు బస్తీలలో ర్యాలీ నిర్వహించారు. పేదల కోసం పోరాడుతున్న పార్టీకి విరాళాలు ఇచ్చి ఆండగా నిలవాలని ఇంటింటికి, దుకాణాల వద్దకు వెళ్లి విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు జె ఆనంద్ గౌడ్లు పాల్గొని ప్రసంగించారు. దేశంలో పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, రైతుల కష్టాలు, విద్య, ఆరోగ్య రం గాలలో ఎదురౌతున్న సంక్షోభం పై సీపీఐ నిరంతరం పోరాడుతుందన్నారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని ప్రశ్నిస్తున్నది సీపీఐ పార్టీ యే నని గుర్తు చేశారు. కార్మికుల హక్కుల సాధన కోసం పోరాడుతున్న పార్టీ సీపీఐ అని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఐ రాజేంద్రనగర్ మండల సహాయ కార్యదర్శి జె విజయానంద్ గౌడ్, మండల కార్యాలయ కార్యదర్శి జి. సత్యం, మహిళా సమాఖ్య రాజేంద్రనగర్ మండల అధ్యక్షురాలు మునీశ్వరి, ఉపాధ్యక్షురాలు కుకునూరు వాణి, నాయకులు సయ్యద్ ఖాజ ఎండీ సలీం, జె సదానంద్ గౌడ్, సాబీర్, మౌనిక, జ్యోతి, ఉర్మిళ, బుజ్జి, క్రిష్ణ, లక్ష్మయ్య, కైలాసమ్మ, జిలానీ, పుష్ప నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## కౌన్సిలర్ ను మాదిగ అని కులం పేరుతో దూషించిన మున్సిపల్ కమిషనర్..

**వడ్డేపల్లి మున్సిపాలిటీలో జరిగిన సంఘటనపై కమిషనర్ రాజయ్య చేసిన ఆరోపణలకు.. స్పందించిన వడ్డేపల్లి మాజీ జడ్పిటిసి శ్రీనివాసులు...,.**

**గద్వాల జిల్లా ప్రతినిధి ( వడ్డేపల్లి) ఏప్రిల్ 9 ప్రభాత ఉదయం**

వడ్డేపల్లి మున్సిపాలిటీ కేంద్రమైన శాంతినగర్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాజీ జెడ్పిటిసి వడ్డేపల్లి శ్రీనివాసులు కోఆప్షన్ ఎన్నిక విషయంపై ఆఫీసుకు వెళ్తే కనీసం నియమ నిబంధనలు తెలపకుండా వచ్చిన పాలకవర్గంతో తీవ్ర దుర్భాష లాడారని కమిషనర్ రాజయ్య నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలిపారు..మునిసిపల్ కమిషనర్ రాజయ్య ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని.. రాజారికం లా తీరు ఉందని.. ఈయన వ్యవహార శైలిని మంత్రులు సీఎం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు..జడ్చర్ల ఎమ్మెల్యే ఇలాకాలో పనిచేసి వచ్చానని నేనింతే అన్నట్లుగా చెప్తూ పాలకవర్గంతో ఇష్టానురితంగా వ్యవహరిస్తున్నారని వడ్డేపల్లి శ్రీనివాసులు ఆరోపించారు. మా కౌన్సిలర్ విజయభాస్కర్ ను కులం పేరుతో మాదిగ అని అసభ్యకరంగా మాట్లాడడం సబబు కాదని తెలియచెప్పిన అదేవిధంగా రౌడీల ప్రవర్తించారని ఇటువంటి అధికారుల పైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా తెలపడం జరిగింది .కౌన్సిలర్ విజయభాస్కర్ మాట్లాడుతూ ... మున్సిపాలిటీ కార్యాలయం లో కో –ఆప్షన్ సభ్యుల ఎన్నికల కొరకు నామినేషన్ పత్రాలు ఇవ్వడానికి ప్రస్తుత వడ్డేపల్లి మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ తో పాటు కౌన్సిలర్ అయిన నేను , నాతోపాటు మాజీ కౌన్సిలర్ అజయ్ కుమార్, వేణు, చాంద్ బాషా కొంతమందితో కలిసి వడ్డేపల్లి మున్సిపాలిటీకి వెళ్లగా కమీషనర్ నామినేషన్ పత్రాలు దాదాపుగా 30 నిమిషాలు తీసుకోవడానికి రాలేదు..30 నిమిషాల తర్వాత అక్కడికి కమిషనర్ సార్ వచ్చిన తర్వాత ప్రాంగణంలో ఉండే ఎందుకు ఇంత ఆలస్యం అయిందని చైర్మన్ వచ్చారని కౌన్సిలర్ గా నేను అనే విజయభాస్కర్ ని కమీషనర్ని అడగగా నువ్వు ఎవడివి రా మున్సిపల్ చైర్మన్ కు దిక్కు లేదు, ఇక్కడ నీవు కేవలం కౌన్సిలర్ వి అని చులకనగా చెప్తూ ,అంతేకాకుండా కులం పేరుతో అసభ్య పదజాలంతో నన్ను దూషించడంతో నా పక్కన ఉన్న వేణు అది తప్పు అని మర్యాదపూర్వకంగా సార్ కి చెప్పగా నువ్వు ఎవరు వీళ్లకు వత్తాసు పలకడానికి వచ్చావా మీరు బయటకు వెళ్ళండి అని.. దుర్భాషలాడుతూ ఒక రౌడీలా ప్రవర్తించారని కౌన్సిలర్ విజయభాస్కర్ తన ఆవేదనలను వ్యక్త పరచడం జరిగింది.ఇలా మర్యాద లేకుండా ప్రభుత్వ ఉద్యోగులు మున్సిపల్ కమిషనర్ కౌన్సిలర్ విజయభాస్కర్ అనే నన్ను అవమానపరచడంతో వారిపై చట్టమైన చర్యలు తీసుకోవాలని తనకు న్యాయం చేయాలని స్థానిక పోలీస్ స్టేషన్లో శాంతినగర్లో ఫిర్యాదు చేయడం జరిగిందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో మునిసిపల్ చైర్మన్ మంజుల, మాజీ జెడ్పిటిసి సీనియర్ నాయకులు వడ్డేపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా అభీష్టం మేరకే నల్తూర్ గ్రామంలోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి సానుకూలం

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సానుకూలం**

**జిన్నారం మున్సిపల్ చైర్మన్ నకిర్తి జనార్ధన్ వెల్లడి**

**పటాన్ చెరు, ఏప్రిల్ 9 (ప్రభాత ఉదయం):**

జిన్నారం మున్సిపల్ నల్తూరు గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ పై బుధవారం జిల్లా కలెక్టర్ తో మాట్లాడిన విషయంపై గురువారం క్యాంపు కార్యాలయంలో పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కి జిన్నారం మున్సిపల్ నల్తూరు గ్రామం లోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ కొనసాగించాలని జిన్నారం మున్సిపల్ చైర్మన్ నా కీర్తి జనార్ధన్ కౌన్సిలర్ ల ఆధ్వర్యంలో కలిసి మెమోరాండం ఇచ్చారు. దీనికి పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ జిన్నారం మున్సిపల్ ప్రజలు ఎక్కడ కోరుకుంటే అక్కడే కొనసాగిస్తానని సానుకూలంగా స్పందించారు. ఈ విషయంపై జిన్నారం మున్సిపల్ చైర్మన్ నకిర్తి జనార్దన్ మాట్లాడుతూ నల్తూరు గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణంలో అపోహలు అనుమానాలు పెంచుకోవద్దని ప్రజా అభీష్టం మేరకే స్కూల్ నిర్మాణం అభివృద్ధి దిశగా నల్తూర్ గ్రామం లోనే చేపడతామని ఈ సందర్భంగా వెల్లడించారు., కార్యక్రమంలో చైర్మన్ నకిర్తి జనార్ధన్ తో పాటు కౌన్సిలర్ ప్రభాకర్ రెడ్డి, బేలే కృష్ణ నాయకులు శంకరప్ప ఆదిరామకృష్ణ కొడకంచినాగరాజు పెద్దమ్మ గూడెం నాగరాజు మాజీ సర్పంచులు యాదయ్య శ్రీశైలం యాదవ్ నల్తూరు మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ కృష్ణ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





పాన్ షాప్ నిర్వాహకునిపై దాడి చేసిన యువకులు

## పాన్ షాప్ నిర్వాహకునిపై దాడి చేసిన నలుగురు యువకుల అరెస్ట్

**బుద్వేల్, ఏప్రిల్ 9 (ప్రభాత ఉదయం)**

ఈ నెల 2వ తేదీన తెల్లవారు జామున 420 నిమిషాలకు పాన్ షాప్ తెరచి తమకు సిగరేట్ ఇవ్వాలని కోరగా, దుకాణం తెరిచినాక ఇస్తానన్న పాపానికి పాన్ షాప్ నిర్వాహకునిపై కట్టెలతో దాడి చేసి విపరీతంగా కొట్టిన కేసులో నలుగురు యువకులను అత్తాపూర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. ఇన్స్ పెక్టర్ కె నాగేశ్వర్ రావు తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి... శాస్త్రీపురం కింగ్స్ కాలనీకి చెందిన షేక్ వాసీమ్ ( 37) కు పీడీపీ చౌరస్తా అర్మాన్ హోటల్ వద్ద పాన్ షాప్ ఉంది. ఈ నెల 2వ తేదీన ఉదయం 4.20 నిమిషాలకు షేక్ వాసీమ్ పాన్ షాప్ వద్దకు వచ్చాడు. అప్పటికి పాన్షాప్ తెరవలేదు. అక్కడికి వచ్చిన నలుగురు య వకులు అతన్ని గుర్తు పట్టి పాన్షాప్ తెరచి సిగరేట్లు ఇవ్వాలని కోరారు. దానికి అతడు నిరాకరించి పాన్షాప్ ను 5 గంటల తర్వాత తెరుస్తాను అప్పుడు ఇస్తాను అని సమాధానం ఇచ్చాడు. దీంతో ఆగ్రహించిన ఆసీఫ్ నగర్ కు చెందిన మీర్ మహ్మద్ అలీ అలియాస్ ఇర్ఫాన్ అలియాస్ ఇర్ఫాన్ బిల్లా (38), షాహీన్ నగర్ ఎర్రకుంటకు చెందిన మహ్మద్ మోయినుద్దీన్ అలియాస్ మోయిన్ పటేల్ (38), మా సబ్యాంక్ కు చెందిన మహ్మద్ ముస్తాక్ అలియాస్ సల్మాన్ ( 28), విజయనగర్ కాలనీ కి చెందిన మహ్మద్ రహీముద్దీన్ (21)లు ఆగ్రహంతో తాము అడిగితే సిగరేట్లు ఇవ్వవా అంటు భూతులు తిడుతు కట్టెలతో దాడి చేసి గాయపరిచాడు. షేక్ వాసీమ్ ఇచ్చిన వీర్యాదు మేరకు నలుగురు యువకులను అరెస్ట్ చేసి గురువారం రిమాండ్ కు తరలించారు.




## పాఠశాల స్థలం కబ్జాకు యత్నం

**బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**మెదక్ ఎంపీ రఘునందన్ డిమాండ్ కలెక్టర్ తీరుపై తీవ్ర అసంతృప్తి**

**పటాన్ చెరు, ఏప్రిల్ 9 (ప్రభాత ఉదయం):**

పటాన్ చెరు పట్టణం నడిబొడ్డున వున్న జిల్లా పరిషత్ హై స్కూల్ స్థలం కబ్జాచేసేందుకు యత్నిస్తున్నారని,ఇందులో భాగంగానే పాఠశాల భవనాన్ని రాత్రికి రాత్రి కూల్చి వేశారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు.ఈ విషయంలో కలెక్టర్ తీరుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు.గురువారం పటాన్చెరు శ్రీనగర్ కాలనీలో మంగళవారం రాత్రి కూల్చి వేసిన పాఠశాల భవనాన్ని బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఫోన్ చేసి కలెక్టర్ కు,డీసీపీ కి ఫిర్యాదు చేసేవరకు కూల్చివేతలు కొనసాగాయని తెలిపారు.జాతీయ రహదారి విస్తరణకు పాఠశాల అడ్డుగా లేకున్నా ఎందుకు కూల్చివేశారు,ఎవరు కూల్చారు,ఎవరి ఆదేశాలతో కూల్చారో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల ప్రహరికి ముందు ఉన్న దుకాణాలు తొలగించకుండా ప్రహరీ నుంచి పది అడుగుల దూరంలో ఉన్న భవనాన్ని రాత్రికి రాత్రి ఎందుకు కూల్చాల్సి వచ్చిందని ప్రశ్నించారు. 1962 కు పూర్వం నుంచే అక్కడ పాఠశాల ఉందని,భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన ప్రొసీడింగ్స్ చూపిస్తూ,సర్వే రిపోర్ట్ లను సైతం ఆయన ప్రదర్శించారు.స్థానికంగా ఉన్న కొందరు ఆ భూమి పై వివాదం సృష్టించి కింది కోర్టు నుంచి సుప్రీం కోర్ట్ వరకు అన్నికోర్టుల్లోనూ ఓడిపోయారని గుర్తు చేశారు.పాఠశాల స్థలాన్ని కాపాడాల్సిన అధికారులు కబ్జాదారులకు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ విషయంలో జిల్లాకలెక్టర్ స్పందన పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు.వెంటనే అధికారులను పంపి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి ఉదాసీనంగా వ్యవహరించారని ఆరోపించారు.ఇప్పటికైనా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో స్థానికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.జాతీయ రహదారి విస్తరణకు,పాఠశాల కూల్చి వేతకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.మరియు కబ్జాకు గురవుతున్న పాఠశాల స్థలాన్ని మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు జిన్నారం మున్సిపల్ చైర్మన్ ప్రతాపరెడ్డి.అమ్దూరి మాజీ సర్పంచ్ నర్సింగరావు, అమీన్పూర్ బిజెపి మండల అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్. శ్రీనివాస్ గుప్తా, బైండ్ల కుమార్,శంషాబాద్ రాజు ముదిరాజ్,కొండా లక్ష్మణ్,సుజాత, బాల్రాజ్,పాత్రికేయ మిత్రులతో కలిసి కూల్చివేసిన పాఠశాల స్థలాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు


ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు, సిబ్బంది.
చిత్రంలో నవజ్యోతి యూత్ క్లబ్ ప్రధాన కార్యదర్శి శ్యామల గంగాధర్

## రాజేంద్రనగర్లో ఉచిత వైద్య శిబిరం

**బుద్వేల్, ఏప్రిల్ 8 (ప్రభాత ఉదయం)**

ప్రజా పాలన – పట్టణ ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో బాగంగా రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ ఆవరణలో రాజేంద్రనగర్ బస్తీ దవఖాన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలతో పాటు ఇతర వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించి వైద్య పరీక్షలు చేశారు. అవసరమున్న వారికి మందులను పంపిణీ చేశారు. 188 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు డాక్టర్ చైతన్య తెలిపారు. ప్రజలు తరచు . ఆరోగ్య పరీక్షలు చేసుకోవడం మంచిదన్నారు. నలబై సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు వ్యాయమం చేయాలన్నారు. ముఖ్యంగా వాకింగ్ చేయడం మంచిదన్నారు. ఆరోగ్య సూత్రాలను పాటిస్తు, అహారం తీసుకునే విషయంలోను జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో నవజ్యోతి యూత్ క్లబ్ ప్రధాన కార్యదర్శి శ్యామల గంగాధర్, ఉపాధ్యక్షులు పి రవీందర్, ఎం కార్తీక్ లతో పాటు వైద్య సిబ్బంది ఎం అం డాలు, ఎం ఆనురాధ, జి భవానీ, అంగన్వాడీ టీచరు సంగీత, ఆశా వర్కర్లు టి మీనా ఈ మీనా లు పాల్గొన్నారు.

## ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళ పై లైంగికదాడికి పాల్పడిన కేసులో ఓ వ్యక్తికి 20 సంవత్సరాల జైలు శిక్ష రూ.5100 జరిమాన

**బుద్వేల్, ఏప్రిల్ 9 (ప్రభాత ఉదయం)**



ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళను కూర అడగటానికి వెళ్లి ఆమె ఒకర్తే ఇంట్లో ఉందని గ్రహించి ఆమె నోరు మూసి లైంగికదాడికి పాల్పడి ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తాను అని బెదిరించిన ఓ వ్యక్తికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.5100 జరిమాన విదిస్తు రం గారెడ్డి జిల్లా 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి ఎం వాణి గురువారం తీర్పు వెల్లడించారు. వివరాలను మైలార్దేవుపల్లి ఇన్స్ పెక్టర్ సత్యనారాయణ గురువారం వెల్లడించారు. 2018 జూన్ 15వ తేదీన మద్యాహ్నం 2 గంటల సమయంలో ఫిర్యాదురాలు ఇంటికి వెళ్లిన ఎన్టీఆర్ నగర్ ఉడంగడ్డ కు చెందిన సోమశిల మహేందర్ (40) కూర ఉందా అని అడిగాడు. ఆ సమయంలో ఆ మహిళ ఒక్కరే ఇం ట్లో ఉందని గ్రహించి ఇంటికి లోపలి నుంచి తాళం వేసాడు. ఆమె నోరు మూసీ లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైన చెబితే చంపేస్తానని బెదిరించాడు. బాదితురాలు ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదు చేసుకున్న మైలార్ దేవుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసులో నిం దితుడు సోమశిల మహేందర్ కు న్యాయమూర్తి 20 సంవత్సరాల జైలు శిక్ష తో పాటు రూ. 5.100 జరిమాన విధిస్తు తీర్పు వెల్లడించారు.


శివరాంపల్లి లో గల రాజేంద్రనగర్ విద్యుత్ డీ ఈ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టిజన్లు

## విద్యార్హతలను బట్టి ఆర్టిజన్లకు ప్రమోషన్లు ఇప్పించాలి

**రాజేంద్రనగర్ సర్కిల్ విద్యుత్ ఆర్టిజన్స్ జే ఏ సీ చైర్మన్ కె రాజు డిమాండ్**

**బుద్వేల్, ఏప్రిల్ 9 (ప్రభాత ఉదయం)**

విద్యార్హతల ఆధారంగా విద్యుత్శాఖ లో పనిచేస్తున్న విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల కన్వర్షన్ చేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల జేఏసీ ఛైర్మన్ కె రాజు డిమాండ్ చేశారు. ఆర్టిజన్లకు విద్యుత్ శాఖ సర్వీస్ రూల్స్ అమలు చేయాలన్నారు. టీజీఎస్పీడీసీఎల్, టీజీఎస్ పీడీసీఎల్ లలో అన్మాస్ట్ వర్కర్లను ఆర్టిజన్లుగా విలీనం చేయాలన్నారు. విద్యుత్ సంస్థలలో 2016 డిసెంబరు 4వ తేదీ కంటే ముందు నుంచి అన్ని అర్హతలు ఉండి పనిచేస్తున్న ఇప్పటికి ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులకు కొనసాగుతున్న వారిని ఆర్టిజన్లుగా గుర్తించాలన్నారు. విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న పీస్ రేట్ కార్మికులకు జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు చెల్లిం చాలన్నారు. 2026 పీఆర్సీ వేతన సవరణ అమలు చేయాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాలు ఆపమని స్పష్టం చేశారు. నిరసన కార్యక్రమంలో విద్యుత్ ఆర్టిజన్ జేఏసీ రాజేంద్రనగర్ సర్కిల్ కన్వీనర్ ఎన్ స్వామి, రాజేంద్రనగర్ డివిజన్ కు చెందిన సీతారాం, శంకర్, రాములు, వెంకట కృష్ణ మాసయ్య. అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.




భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం అందజేసే ఈశ్రమ్ కార్డులను లబ్దిదారులకు అందజేస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకులు ఎన్ మల్లారెడ్డి, ఎర్ర హరినాథ్, ఎస్బీ హరినాథ్ లు పాల్గొన్నారు. ప్రతి భవన నిర్మాణ కార్మికుడు ప్రభుత్వం అందజేసే ఈ శ్రమ్ కార్డును పొంది ప్రభుత్వ పథకాలను అందుకోవాలని కోరారు.

-బుద్వేల్, ప్రభాత ఉదయం

# ఎయిడ్స్‌పై అవగాహనతోనే నివారణ సాధ్యం

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 09(ప్రభాత ఉదయం):**

ఎయిడ్స్‌పై అవగాహనతోనే నివారణ సాధ్యం అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య వారోత్సవాల కింద నాలుగో రోజు ఎయిడ్స్ పై అవగాహన, నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం రెడ్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై, ఈ రెడ్ రన్ వాకథాన్ ర్యాలీని జెండా ఊపి గురువారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో స్థానిక బస్టాండ్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ఎయిడ్స్ నివారణపై తెలంగాణ సాంస్కృతిక కళాకారులచే కళాజాత ద్వారా పాటలు ఆలపించి, అవగాహన కల్పిస్తూ ఈ రెడ్ రన్ వాకథాన్ ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎయిడ్స్ (ఎచ్ఐవి /ఎయిడ్స్ ) వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఎయిడ్స్ ఒక నివారించలేని (ఇంకరబుల్ ) వ్యాధి అయినప్పటికీ, సరైన జాగ్రత్తలు తీసుకుంటే దీనిని అరికట్టవచ్చని తెలిపారు. అసురక్షిత లైంగిక సంబంధాలు, సంక్రమిత రక్తం (ఇన్ఫెక్టెడ్ బ్లడ్ ట్రాన్స్ఫ్యూషన్ ), వాడిన సిరంజీల ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందని వివరించారు. అందువల్ల ప్రతి ఒక్కరూ సురక్షిత పద్ధతులను పాటిస్తూ, జాగ్రత్తగా ఉండాలన్నారు. జిల్లాలో కూడా (2040) ఎయిడ్స్ కేసులు నమోదయ్యాయని, ప్రస్తుతం (1342) మంది బాధితులకు జిల్లా కేంద్రంలోని జీజీహెచ్ ఆసుపత్రిలో గల ఏఆర్టీ కేంద్రంలో అవసరమైన చికిత్స అందిస్తున్నామన్నారు. అలాగే జనగామ, ఘనపూర్ (స్టేషన్) లలో ఐసీటీసీ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ మేరకు బాధితులు భయపడకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందాలని సూచించారు. అదే విధంగా పల్లెల్లో, పట్టణాల్లో ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించేందుకు కళాజాతలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు ఈ కార్యక్రమాలలో పాల్గొని, వ్యాధి గురించి సరైన సమాచారం తెలుసుకోవాలని కోరారు. ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించడం ద్వారా సమాజాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుకోవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. ర్యాలీలో వైద్య అధికారులు, ఏఎన్ఎంలు, ఆశాలు, సిబ్బంది, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, చేతిలో ప్లకార్డులు పట్టుకొని "ఎయిడ్స్ నివారణ" నినాదాలతో ప్రజలకు సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, డా. అశోక్, ప్రోగ్రామ్ అధికారి (ఎన్టీఈపీ), డా. కమల్ హసన్, డా. శ్రీతేజ, ఏఆర్టీ సెంటర్ వైద్యాధికారులు, ఇతర సంబంధిత వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఎన్జీఓలు, ట్రాన్స్జెండర్లు, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో జిల్లా కలెక్టర్






## బాటసారుల దాహార్తిని తీర్చేందుకు వేసవిలో చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

### కూకట్ పల్లి డీసీపీ రితిరాజ్

**కూకట్ పల్లి, ఏప్రిల్ 9 (ప్రభాత ఉదయం)**

వేసవి ఎండల నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు, సైబరాబాద్ పోలీస్ కమీషనర్ రమేష్ రెడ్డి, ఐపీస్ పిలుపు మేరకు బాలానగర్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు కూకట్ పల్లి డీసీపీ రితిరాజ్, ఐపీస్ పేర్కొన్నారు. బాలానగర్ సీఐ నర్సింహా రాజు ఆధ్వర్యంలో నర్సాపూర్ చౌరస్తా ఆటో స్టాండ్ వద్ద ఏర్పాటు చేసినా తాగునీటి కేంద్రాన్ని డీసీపీ రితిరాజ్, బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి తోకలసి గురువారం ప్రారంభించారు. సైబద్రాబాద్ పోలీస్ శాఖ తరపున బాలానగర్ పోలీస్ సిబ్బంది చేపట్టిన ఈ సేవా కార్యక్రమాన్ని డీసీపీ అభినందించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ చలివేంద్రాలతో బాటసారుల దాహార్తి తీరుతుందని, సేవాదృక్పథంతో పోలీసులు ముందుకు వెళ్లి సమాజంలో ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని, ప్రజల మన్ననలు పొందాలన్నారు. ప్రజలు ఎండలో తిరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీసీపీ సూచించారు.

ఈ కార్యక్రమంలో బాలానగర్ డిఐ సక్రమ్, ఎస్ఐలు సరితా రెడ్డి, హాజీ మియా, వినోద్ కుమార్, పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.



ఇన్విటేషన్ కార్డ్స్ విడుదల చేస్తున్న నాయకులు

## మహనీయుల జయంతి ఉత్సవాలలో సబ్బండా వర్గాలు పాల్గొనాలి

### జనగామ మహనీయుల ఉత్సవ కమిటీ

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 9 (ప్రభాత ఉదయం):**

మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని భారత రత్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఘనంగా విడుదల చేశారు. మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షులు గద్దల కిషోర్, గౌరవ అధ్యక్షులు బోట్ల శేఖర్, ఇతర కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో మహనీయుల జయంతి వేడుకలను ప్రజలందరూ ఐకమత్యంతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని, ఏప్రిల్ 13న సాయంత్రం జనగామ రైల్వే స్టేషన్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించే అంబేద్కర్ జ్ఞాన యాత్రలో కుల మతాలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఏప్రిల్ 14న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలకు సబండ వర్గాలు, కులాలు, అన్ని వర్గాల ప్రజలు భారీ సంఖ్యలో హాజరై, ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలోకౌన్సిలర్ పానుగంటి సువార్త, మాజీ కౌన్సిలర్ కన్నారపు ఉపేందర్, ఉత్సవాల కమిటీ ఉపాధ్యక్షులు జేరిపోతుల ఉపేందర్, వాంకుడోత్ అనిత, ఉత్సవాల కమిటీ సలహాదారులు జేరిపోతుల కుమార్, తిప్పారపు విజయ్, రాగల్ల ఉపేందర్, ఎంఆర్పిఎస్ నాయకులు ఇనుముల నర్సయ్య, పైసా రాజశేఖర్,గువ్వల రవి, బోట్ల మహేష్, మారయ్య ఉత్సవాల కార్య నిర్వాహక కార్యదర్శులు యసారపు కర్ణాకర్, గజ్వేల్ ప్రతాప్, మౌనిక, మంజుల, బక్క రవి, ఆశిష్ వివిధ సంఘాల నాయకులు పాల్గొని, మహనీయుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు.



## ప్రధానమంత్రి ధన్ ధాన్య యోజన (పిఎండిడికెవై) పథకాన్ని సమర్థంగా అమలు చేయాలి

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 09(ప్రభాత ఉదయం):**

ప్రధానమంత్రి ధన్ ధాన్య యోజన (పిఎండిడికెవై ) పథకాన్ని సమర్థంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ప్రధానమంత్రి ధన్ ధాన్య యోజన (పిఎండిడికెవై ) పథకం అమలుపై జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ పథకంలో నిర్దేశించిన లక్ష్యాల వంటి పంటల ఉత్పాదకత పెంపొందించడం, సుస్థిర వ్యవసాయ పద్ధతుల అవలంబన, రైతులకు సులభతరంగా రుణ సహాయం అందించడం, ప్రత్యామ్నాయ పంటల సాగు, వ్యవసాయ అనుబంధ పరిశ్రమల అభివృద్ధి, మేలైన నీటి యాజమాన్యం, వ్యవసాయ రంగంలో సాంకేతికత అభివృద్ధి గురించి చర్యలు చేపట్టాలని సూచించారు. పీఎండీడీకేవై పథకం అమలులో జిల్లాను ఆదర్శ జిల్లాగా నిలబెట్టేలా ప్రతి శాఖ సమన్వయంతో పని చేసి, లక్ష్యాలను చేరుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోనీ, ఉద్యాన శాఖ అధికారి రవి కాంత్, పశుసంవర్ధక శాఖ అధికారి మురళీధర్ రావు, మత్స్య శాఖ అధికారి రాణా ప్రతాప్, మార్కెటింగ్ శాఖ అధికారి రామకృష్ణ, సహకార శాఖ అధికారి కోదండరాములు, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి వసంత, లీడ్ బ్యాంక్ మేనేజర్ మూర్తి, కేవీకే మామ్నూర్ శాస్త్రవేత్త, నాబార్డ్ ఏజీఎం, ఇతర అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే ప్రమాదాల బారిన పడకుండా ఉంటారు

### ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ను తప్పనిసరిగా ధరించాలి

### వాహనదారులకు అవగాహన కల్పించిన కూకట్ పల్లి ట్రాఫిక్ సి.ఐ తిమ్మప్ప

**కూకట్ పల్లి, ఏప్రిల్ 9 (ప్రభాత ఉదయం)**



సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కూకట్‌పల్లి ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమం ప్రజల్లో మంచి స్పందన లభించింది. కూకట్ పల్లి ట్రాఫిక్ సి.ఐ తిమ్మప్ప నాయకత్వంలో ఈ కార్యక్రమం క్రమబద్ధంగా సాగింది. సిఐ తిమ్మప్ప స్వయంగా రోడ్డుపైకి దిగి హెల్మెట్ ధరించని వాహనదారులను ఆపి, వారి ప్రాణ రక్షణలో హెల్మెట్ ఎంత కీలకమో వివరిస్తూ చైతన్యం కల్పించారు. హెల్మెట్ ధరించినప్పటికీ స్ట్రాప్ సరిగా పెట్టుకోని వారికి కూడా జాగ్రత్తలు సూచించారు. పిలియన్ రైడర్ కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేస్తూ, నిబంధనలు పాటిస్తున్న వాహనదారులను అభినందించడం ద్వారా ఇతరులకు ఆదర్శంగా నిలిపారు. ఇక పాదాచారుల భద్రతపై కూడా సిఐ తిమ్మప్ప ప్రత్యేక దృష్టి సారించారు. సిగ్నల్ వద్ద ఎరుపు దీపం వెలిగినప్పుడు వాహనదారులు తప్పనిసరిగా ఆగి, పాదాచారులు రహదారి దాటే వరకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ట్రాఫిక్ సిబ్బంది చురుకుగా పాల్గొని ప్రజల్లో అవగాహన కల్పించారు.

# కూకట్‌పల్లికి ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలు కావాలని పోరాడి తీసుకువచ్చాం

### జూనియర్, డిగ్రీ కళాశాలలు ఒకే క్యాంపస్ లో ఉండటంతో స్థలం సరిపోక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు

### అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములలో నాలుగు ఎకరాల స్థలాన్ని డిగ్రీ లేదా, జూనియర్ కళాశాలకు కేటాయించాలి

### ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్మించిన నూతన భవనాన్నీ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తో కలిసి ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్ పల్లి, ఏప్రిల్ 9 (ప్రభాత ఉదయం)**



పేద విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చదువుకోవాలంటే నాంపల్లి వెళ్లి డిగ్రీ ఇంటర్ చదువుకునే రోజులలో కూకట్ పల్లి కి ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలు కావాలని పోరాడి తీసుకువచ్చానని కూకట్ పల్లి ఏమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. కళాశాలను కూకట్ పల్లి కి మంజూరు చేసినప్పటికీ మౌలిక వసతులు లేక పోవడంతో విద్యార్థులకు కావాల్సిన బెంచీలు ఇతర సదుపాయాలను ఒక సంవత్సర కాలం పాటు సొంత నిధులను ఖర్చు చేసి అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ఆనాడు ముందుచూపుతో చేపట్టిన కళాశాల ఏర్పాటు నేడు తెలంగాణ రాష్ట్రంలో డిగ్రీ కళాశాలలో అగ్రగామిగా కూకట్ పల్లి డిగ్రీ కళాశాల ఉండే స్థాయికి చేరిందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. జూనియర్, డిగ్రీ కళాశాలలు ఒకే క్యాంపస్ లో ఉండటంతో స్థలం సరిపోక రెండు కళాశాలల విద్యార్థులు అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కూకట్ పల్లి హుడా ట్రక్ పార్క్ స్థలంతో పాటు కెపిహెచ్బి, బాలానగర్ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నాయని వాటిలో నాలుగు ఎకరాలు డిగ్రీ లేదా జూనియర్ కళాశాలకు కేటాయించాలని కోరారు. ప్రభుత్వ నిధులు లేకపోతే సీ ఎస్ ఆర్ నిధులతో భవనాలను నిర్మించేందుకు కృషి చేస్తానని ఏమ్మెల్యే తెలిపారు. భూమి కేటాయించేందుకు కలెక్టర్, విప్ మహేందర్ రెడ్డిలు కృషి చేయాలని కోరారు. కూకట్ పల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్మించిన నూతన భవనాన్నీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు భవనాన్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ మనూ చౌదరి తదితర అధికారులు, కళాశాల సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి, కలెక్టర్ లు మాట్లాడుతూ, నూతన భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తీసుకురావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కాలేజీలు, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రైవేట్ విద్యాసంస్థలతో పోటీగా నిలిచేలా నాణ్యమైన విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. కూకట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాష్ట్రానికి, జిల్లాకు ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. ఈ కార్యక్రమములో మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్ కుమార్, సభిహా గౌసుద్దీన్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సోలార్ పవర్ ప్లాంట్ స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

## పర్యావరణ హిత విద్యుత్ ఉత్పత్తికి అడుగులు

### అశ్వారావుపల్లిలో సోలార్ ప్లాంట్ స్థల పరిశీలన

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 09(ప్రభాత ఉదయం):**

జిల్లాలోని రఘునాథపల్లి మండలం, అశ్వారావుపల్లి గ్రామ పరిధిలో ప్రతిపాదించిన సోలార్ పవర్ ప్లాంట్ యూనిట్ కు సంబంధించి స్థలాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంట్ ఏర్పాటుకు కేటాయించిన భూమి పరిస్థితిని సమీక్షించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్లాంట్ ఏర్పాటు చేయాల్సిన ప్రదేశాన్ని తక్షణమే శుభ్రపరిచి, చెత్తను తొలగించాలని అధికారులను ఆదేశించారు. అలాగే పనులను ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించాలని స్పష్టం చేశారు. సోలార్ పవర్ ప్లాంట్ యూనిట్ ద్వారా పర్యావరణ హితమైన విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని, ప్రాంతీయ అభివృద్ధికి ఇది ఎంతో దోహదం చేస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ పరిశీలనలో ఆర్డీఓ గోపీరాం, డీఆర్డీఏ వసంత, రెడ్కో అధికారులు, వెండర్లు, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

# రెండు పడక గదుల ఇండ్లు అద్దెకిస్తే కేటాయింపు రద్దు

**మెడికల్ కళాశాల విద్యార్థుల, సిబ్బంది హాజరు నివేదించాలి.**

**ఇందిర మహిళా శక్తి భవన నిర్మాణం వేగవంతం కావాలి.**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 9(ప్రభాత ఉదయం)**



గద్వాల పట్టణ శివారులోని రెండు పడక గదుల ఇండ్ల సమీపంలో జిల్లా ఆసుపత్రి, మెడికల్, నర్సింగ్ కళాశాలలు, సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ భవనాలు నిర్మించడంతో ఈ ప్రాంతం మెడికల్ హబ్ గా అభివృద్ధి చెందబోతోందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.గురువారం గద్వాల శివారులో రూ. 5.7 కోట్ల నిధులతో నిర్మిస్తున్న ఇందిర మహిళా శక్తి భవనంతో పాటు పక్కనే కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అలాగే మెడికల్, నర్సింగ్ కళాశాలల భవనాలు, రెండు పడక గదుల ఇండ్ల సముదాయంను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిర మహిళా శక్తి భవన నిర్మాణం నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని గుత్తేదారును ఆదేశించారు. ఈ భవనం ప్రారంభించుకున్నాక మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు వివిధ సందర్భాల్లో శిక్షణ కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. భవనంలో నిర్మిస్తున్న డార్మెటరీ హాల్స్, ఓపెన్ డైనింగ్, కిచెన్, తదితర గదులను తిరిగి పరిశీలించారు. భవనం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి, ఫర్నిచర్, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన నిధులకై ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలం కావలసి ఉ ండడంతో రెవెన్యూ అధికారులు ప్రతిపాదించిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. మ్యాప్ ద్వారా పూర్తి వివరాలను సంబంధిత అధికారులు కలెక్టర్ కు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవన నిర్మాణ డిజైన్ పూర్తయితే ప్రతిపాదిత స్థలం వద్ద రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు చేయవచ్చున్నారు. 2026-2027 విద్యా సంవత్సరంలోనే కేంద్రీయ విద్యాలయ తరగతులు ప్రారంభించాల్సి ఉన్నందున భవన నిర్మాణం పూర్తయ్యే వరకు గోనుపాడు గ్రామం వద్ద ఉ న్న గద్వాల మండల కస్తూరిబా విద్యాలయ భవనంలో తాత్కాలికంగా తరగతులు నిర్వహించాలన్నారు. కలెక్టరేట్ సమీపంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న నర్సింగ్ కళాశాల భవనంలో కస్తూరిబా విద్యాలయ నిర్వహణకు పరిశీలించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం సమీపంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవనంలో తాత్కాలికంగా నిర్వహిస్తున్న మెడికల్ కళాశాలను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థుల, సిబ్బంది హాజరు నివేదికను ఎప్పటికప్పుడు తమకు పంపాలని ఆదేశించారు. కళాశాలలోని వివిధ విభాగాల్లో పనిచేసే ఔట్సోర్సింగ్ సిబ్బంది నియామకానికి ఉన్న సమస్యలను పరిష్కరించి నిబంధనల ప్రకారం నియామకాలు చేపట్టాలన్నారు. అనంతరం మెడిసిన్ విద్యార్థులకు తరగతి గదిలో నిర్వహిస్తున్న క్విజ్ పోటీలను కలెక్టర్ కాసేపు కూర్చుని పరిశీలించారు. ప్రస్తుత భవనం ముందు రూ.140 కోట్ల అంచనా తో నిర్మించే మెడికల్ కళాశాల భవన నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు మెడిసిన్ విద్యార్థులు తమ సమస్యలపై కలెక్టర్ కు వినతిపత్రాలు ఇవ్వగా పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.అలాగే పక్కనే రూ.12 కోట్లతో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. నర్సింగ్ కళాశాల అకాడమిక్, వసతి గృహ భవనాల నిర్మాణ పనులు మిగిలి ఉంటే వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నర్సింగ్ కళాశాల భవనంలో వివిధ విభాగాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం సమీపంలోని సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ భవనాన్ని సందర్శించి అక్కడి అధికారులతో మాట్లాడారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ వైద్యశాలలకు ఇక్కడి నుంచే మందులను, ఇతర మెడికల్ సామాగ్రిని సరఫరా చేస్తున్నందున తగు సూచనలు చేశారు.చివరగా రెండు పడక గదుల ఇండ్లను సందర్శించిన జిల్లా కలెక్టర్ అక్కడి పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు. డిప్పు విధానంలో రెండు పడక గదుల ఇండ్లను కేటాయించబడ్డ అర్హులైన లబ్ధిదారులే నివాసం ఉండాలని, అద్దెకు ఇవ్వడం, అమ్ముకోవడం వంటివి చేస్తే కేటాయింపు రద్దుచేసి ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఆ ఇండ్లను ఇవ్వడం జరుగుతుందన్నారు. రెండు పడక గదుల ఇండ్ల సముదాయం వద్ద నీటి సమస్యను పలువురు లబ్ధిదారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రింగ్ రోడ్డు సమీపంలో మెడికల్ హబ్ గా అభివృద్ధి చెందుతున్న ప్రాంతంలో రెండు పడక గదుల సముదాయం నిర్మించడంతో ఈ ప్రాంతానికి భవిష్యత్తులో ఎంతో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇలాంటి విలువైన ప్రదేశంలో నిర్మించిన రెండు పడక గదుల ఇండ్లను వినియోగించుకోకుండా దుర్వినియోగం చేయడం తగదన్నారు. లబ్ధిదారులకు ఏ సమస్య ఉన్న పరిష్కరిస్తామని, నివసించకుండా ఉన్నవాళ్లు నెల రోజుల్లోగా గృహప్రవేశాలు చేసుకోవాలని లేదంటే వారికి కేటాయించిన ఇండ్లను ఇతర అర్హులైన వారికి కేటాయింపు చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ పర్యటనలో ఆర్డీవోశ్రీనివాసరావు,పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్, డిఈ లక్ష్మన్న, డీఈవో విజయలక్ష్మి, టిజి ఎంఎస్ ఐడిసి డిఈ శ్రీనివాసులు, ఏఈ రహీం, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, పర్యవేక్షకులు ఇందిర, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ హనుమంతమ్మ, గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 9 (ప్రభాత ఉదయం)**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు వైద్య బృందాలు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయి అన్నారు. గురువారం మల్దకల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిని డిఎంహెచ్ఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె హాజరు రిజిస్టర్ పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు అధికంగా చేయాలన్నారు. ల్యాబ్, ఫార్మసీ, ఇతర విభాగాలను సందర్శించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అక్కడ సిబ్బందిని ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రోగ్రామ్ అధికారి ప్రసూన రాణి, డాక్టర్ రాజు, డా. స్వరూప రాణి , వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీకి పట్టుబడ్డ పంచాయతీ కార్యదర్శి శాశ్వత తొలగింపు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 9 ( ప్రభాత ఉదయం)**

ఐజ మండలం ఎక్లాస్పూర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా అవుట్సోర్సింగ్ విధానంలో పనిచేసిన బోయ రంగన్న గత నెల 13న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుడితో బిల్లులు మంజూరు చేసేందుకు లంచం డిమాండ్ చేయడంతో ఏసీబీకి పట్టుబడ్డారు. పంచాయతీ కార్యదర్శి రంగన్న పై నేరారోపణ రుజువు కావడంతో శాశ్వతంగా విధుల నుంచి తొలగిస్తూ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని అధికార యంత్రాంగం నిబద్ధతతో, పారదర్శకంగా ప్రజలకు సేవలు అందించాలని విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై, అవినీతికి పాల్పడే వారిపై తగు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన నాయకులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 9(ప్రభాత ఉదయం)**

గద్వాల జోగులంబ జిల్లా ఎర్రవల్లి గ్రామంలో సుజాత, శ్రీనివాస్ రెడ్డి దంపతుల కుమార్తె రిసెప్షన్ వేడుకలు గురువారం జరిగాయి. ఈ రిసెప్షన్ వేడుకల్లో కొత్తకోట మండలం రామకృష్ణాపురం మాజీ సర్పంచ్, మండల సీనియర్ నాయకులు మూలమల్ల భీమ్ రెడ్డి, రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ ఎం బాలరాజు , ఎం కృష్ణయ్య, బి ఆర్ ఎస్ నాయకులు మూలమల్ల యుగంధర్ రెడ్డి, బి సత్యనారాయణ రెడ్డి, బి రాములు , ఎం తిరుపతి, ఎం శివకుమార్ ,ఎం రవికుమార్ , ఎం శ్రీనివాసులు,బండారు మొగులన్న, ఎండి ముజీబ్, రెహమాన్, అబ్దుల్ రహీం పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా భాస్కర్ రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 9(ప్రభాత ఉదయం)**



గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎర్రవల్లి మండలం షేక్ పల్లికి చెందిన భాస్కర్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు డిసిసి అధ్యక్షులు రాజీవ్ రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్ఏ సంపత్ కుమార్ సహకారంతో జిల్లా కమిటీలో జిల్లా అధ్యక్షులు రాజీవ్ రెడ్డి జిల్లా పార్టీ కార్యదర్శిగా భాస్కర్ రెడ్డిని ప్రకటించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ... నాపై ఎంతో నమ్మకంతో పార్టీ జిల్లా ప్రధాని కట్టబెట్టిన ఎసిసి కార్యదర్శి సంపత్ కుమార్, జిల్లా అధ్యక్షులు రాజీవ్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలో పార్టీ పటిష్టత కోసం పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ముందుకు తీసుకెళ్ళి ప్రజలకు కాంగ్రెస్ పార్టీని మరింత చేరువయ్యేలా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం నాయకులు ఆయనకు శుభాకాంక్షలు. తెలియజేసి అభినందించారు..



## శాంతినగర్ నూతన సిఐగా శంకర్

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 9 (ప్రభాత ఉదయం)**

శాంతినగర్ సర్కిల్ కార్యాలయానికి నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ గా శంకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సిఐ టాటా బాబు బదిలీ కావడంతో ఆయన స్థానంలో శంకర్ బదిలీపై శాంతినగర్ వచ్చారు. నూతనంగా నియమితులైన సర్కిల్ ఇన్స్పెక్టర్ శంకర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు, మర్యాదపూర్వకంగా కలిసి బాధ్యతలను స్వీకరించారు.



## ఘనంగా ఎన్ ఎస్ యు ఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ఎన్ ఎస్ యు ఐ లో ప్రస్థాన నీ ప్రారంభించి దేశ రాజకీయాల్లో అనేకమంది సేవలందిస్తున్నారు**

**విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ఎన్ఎస్యుఐ ఎల్లప్పుడూ ముందుంటుంది**

**తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్యుఐ నాయకులు గొల్ల జాన్**


**కూకట్ పల్లి, ఏప్రిల్ 9 (ప్రభాత ఉదయం)**

ఎన్ ఎస్ యు ఐ లో తన ప్రస్థానాన్ని ప్రారంభించి అనేకమంది దేశ రాజకీయాల్లో అగ్రస్థానంలో దేశానికి సేవనందిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్యుఐ నాయకులు గొల్ల జాన్ అన్నారు. మేడ్చల్-మల్కాగిరి జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, ఐడిపిఎల్ చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర నాయకులు గొల్ల జాన్, పృథ్వీ రాజ్ అధ్వర్యంలో ఎన్ ఎస్ యు ఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ఎన్ఎస్యూఐ రాష్ట్ర అధ్యక్షుడు కూన రాఘవేంద్ర గౌడ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు కిషోర్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, సాధు యాదవ్, వెంకటేష్ బిల్లా, తెలంగాణ రాష్ట్ర నాయకులు రితేష్ రావు, కుందన్ యాదవ్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, ఎన్ ఎస్ యు ఐ జెండాను ఆవిష్కరించి, కేక్ కటింగ్ చేశారు. అనంతరం గొల్ల జాన్ మాట్లాడుతూ రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఎంతోమంది తొలి తరం నాయకులకు ఎన్ ఎస్ యు ఐ ఒక శక్తివంతమైన వేదికను కల్పించిందన్నారు. ఇక్కడ తమ ప్రస్థానాన్ని ప్రారంభించిన వారిలో అనేకులు నేడు ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా, ముఖ్యమంత్రులుగా కూడా దేశానికి సేవలందిస్తున్నారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఎన్ ఎస్ యు ఐ లక్షలాది మంది విద్యార్థులకు వారి విద్యాపరమైన ప్రస్థానంలో సహాయపడిందన్నారు. వారిలో అనేకులు ఇప్పుడు దేశ నిర్మాణంలో తమ వంతు కృషి చేస్తున్నారని, విద్యార్థుల సమస్యలను లేవనెత్తడంలోనూ, మన దేశ సామాజిక ఐక్యతను పరిరక్షించడంలోనూ ఎన్ ఎస్ యు ఐ ఎల్లప్పుడూ అగ్రభాగాన నిలిచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్యూఐ నాయకులు సాయి కిరణ్, విజయ్ రెడ్డి, సాద్విక్, హరి రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


## పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలి

**పారిశుధ్య పనులను పరిశీలించిన కౌన్సిలర్**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 9(ప్రభాత ఉదయం)**



గద్వాల మున్సిపాలిటి పరిధిలోని మూడో వార్డులో పారిశుధ్య పనులను గురువారం తెల్లవారు జామున మూడవ వార్డు కౌన్సిలర్ నాగులుయాదవ్ అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. కార్మికుల హాజరు పట్టికను పరిశీలించారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణపై అధికారులు దృష్టి సారించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, బహిరంగ ప్రదేశాలలో చెత్తవేయరాదని కాలనీవాసులకు సూచించారు.



## బిజ్వారంలో చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎస్ఐ శ్రీహరి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 9 ( ప్రభాత ఉదయం)**


మల్దకల్ మండలం బిజ్వారంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం మల్దకల్ ఎస్ఐ శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రం ప్రారంభోత్సవం చేయడం గొప్ప కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వై శైలజ శ్రీనివాసరెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి, బసిరెడ్డి, ఉప సర్పంచ్ చాపల కండ్ల కర్రన్న, గ్రామ పెద్దలు మీసాల రాజారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, వినయ్ కుమార్ రెడ్డి, కొంకల గోకారన్న, సుభాన్ తెలుగు కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ కృష్ణ, మాజీ సర్పంచ్ తిమ్మన్న, ఎల్లప్పనాయుడు, బోయ గోవిందు, భద్రయ్య, వడ్డే గోపాల్, గోపాలకృష్ణ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్లు తనిఖీ చేసిన జేఎండీ

**హైదరాబాద్, ఏప్రిల్ 9(ప్రభాత ఉదయం)**

జలమండలి ఓ అండ్ ఎం డివిజన్-6 ఎస్.ఆర్. నగర్ లో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ పర్యటించారు. డివిజన్ పరిధిలో ట్యాంకర్ డిమాండ్ అధికంగా ఉన్న.. జూబ్లీహిల్స్, వెంకటగిరి ఫిల్లింగ్ స్టేషన్లను ఆయన సందర్శించారు. ట్యాంకర్ బుకింగ్ స్టేటస్, రోజుకి ఎన్ని ట్యాంకర్లు బుక్ అవుతున్నాయి?, ఎన్ని డెలివరీ చేస్తున్నారు? తదితర వివరాలు తనిఖీ చేశారు. ఫిల్లింగ్ స్టేషన్ లో పెండింగ్‌లో ఉన్న ట్యాంకర్ సరఫరాలపై వివరాలు తెలుసుకుని నిర్వహణ పరిస్థితులను పరిశీలించారు. వెంకటగిరి ఫిల్లింగ్ స్టేషన్ వద్ద నీటి ప్రవాహం (ఖీశ్రీశీష ఞ్వ) మరియు అందుతున్న నీటి పరిమాణాన్ని సమీక్షించి, ప్రస్తుత డిమాండ్‌ను తీరుస్తున్న సరఫరా సరిపోతుందా అని ఆరదీశారు చేశారు.ఈ సందర్భంగా ట్యాంకర్‌లను సమయానికి పంపిణీ చేయడం అత్యంత ముఖ్యమని పేర్కొన్న ఆయన, పెండింగ్‌లో ఉన్న అన్ని ట్యాంకర్‌లను ఎటువంటి ఆలస్యం లేకుండా తక్షణమే క్లియర్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, ట్యాంకర్‌ల కదలికపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ, విభాగాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసి, ట్యాంకర్ డెలివరీలో ఆలస్యం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సీజీఎం ప్రభు, జీఎం ప్రభాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

# హిందువులు ఐకమత్యంగా ముందుకు సాగాలి

## హిందూ సమ్మేళన సమితి గౌరవ అధ్యక్షుడు మాజీ శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్



**రాజేంద్రనగర్,ఏప్రిల్09(ప్రభాత ఉదయం)**

సమాజ శ్రేయస్సు కోసం హిందువులుఏకతాటిపై నడవాలని హిందూ సమ్మేళన సమితి గౌరవ అధ్యక్షుడు మాజీ శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ పేర్కొన్నారు.గురువారం కిస్మత్పూర్ హనుమాన్ దేవాలయంలోహిందూ సమ్మేళనం ఏర్పాటుపై కమిటీ అధ్యక్షుడు అన్నపురెడ్డి మాధవరెడ్డితో పాటు కమిటీ సభ్యులతో కలిసి స్వామిగౌడ్ కరపత్రాన్ని విడుదల చేశారు. సందర్భంగా స్వామిగౌడ్ మాట్లాడుతూ...కిస్మత్పూర్ లో ఈనెల19వ తేదీన హిందూ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్టు స్వామిగౌడ్ వెల్లడించారు.పురాణాలు,ఇతిహాసాలు, సంప్రదాయాల ప్రభావంతో సనాతన ధర్మం ప్రారంభమైందని,ఈ సనాతన ధర్మం ప్రతి రూపమే హిందూ సమ్మేళనం అన్నారు.ముఖ్యంగా సనాతన ధర్మం పాటించినప్పుడే సమాజం బాగుంటుందన్నారు.ఇప్పటికే కొంత మంది వారి విధానాల కోసం ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు.అందులో యువత ముందుకు రావడంతో వారి విధానాలకు బానిసలుగా మారుతున్నారని పేర్కొన్నారు.కిస్మత్పూర్ వేదికగా హిందూ బంధువులందరికీ ఐక్యం చేసేందుకు ఈ హిందూ మహాసమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగద్గిరిగుట్ట కేదార్నాథ్ క్షేత్రాధిపతి శివరుద్ర సాధువు,భాగ్యనగర్ విశ్వహిందూ పరిషత్ క్షేత్ర సత్సంగ్ ప్రముక్ శాలివాహన పండరినాథ్,ఎంజిఐటి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ సుధారాణి,లు హాజరవుతారన్నారు.కిస్మత్పూర్ లోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో సాయంత్రం ఐదు గంటల నుండి ఈహిందూ మహాసమ్మేళన కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.ముఖ్యఅతిథుల ప్రసంగాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు వెల్లడించారు.ఈ సమ్మేళన కార్యక్రమానికి కిస్మత్పూర్,దర్గా ఖలీజ్ ఖాన్,హిమాయత్ సాగర్ ప్రాంతాలకు చెందిన హిందూ బంధులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన హిందూ సోదర సోదరీమణులంతా పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఈ కరపత్రం విడుదల కార్యక్రమంలో కమిటీ సభ్యులు నర్సింగరావు,స్వామి,విఠలయ్య,దశరథ్,జి.వెంకటేష్, రామచంద్రారెడ్డి,దామోదర్ రెడ్డి,చంద్రశేఖర్,నీరుడు పవన్సాయి,బాబురావు,తదితరు పాల్గొన్నారు.





## వివాహ వేడుకల్లో నూతన వధూవరులను ఆశీర్వదించిన నాయకులు

**కొత్తకోట, ఏప్రిల్ 9(ప్రభాత ఉదయం)**

వడ్డె వాట తండా సర్పంచ్ రాములు నాయక్ బావమరిది రిసెప్షన్ కార్యక్రమం కొత్తకోట పట్టణంలో క్యూ ఆర్ ఫంక్షన్ హాల్ ,రామకృష్ణాపురం గ్రామానికి చెందిన ఎండి శంషు కుమారుడు సలీం నికా కార్యక్రమాల్లో పాల్గొని నవ వధూవరులను ఆశీర్వదించిన రామకృష్ణాపురం గ్రామానికి చెందిన సి డి సి మాజీ చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి ,ఎం లోకా రెడ్డి ,చర్లపల్లి రామచంద్రారెడ్డి, కొత్తకోట పట్టణానికి చెందిన గంగు బాల్ రెడ్డి, వనపర్తి కృష్ణారెడ్డి, రామకృష్ణాపురం గ్రామానికి చెందిన ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.



## కొత్తకోటను నియోజకవర్గంగా ప్రకటించాలి

### అఖిలపక్ష తీర్మానం

**కొత్తకోట ఏప్రిల్ 9 (ప్రభాత ఉదయం)**

కొత్తకోటను నియోజకవర్గంగా ప్రకటించాలంటూ కొమ్ము భరత్ భూషణ్ నాయకత్వంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో కలిసి గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ, కొత్తకోట ను నియోజకవర్గం గా చేసుకోవడానికి అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయని అభిప్రాయాలు వ్యక్తం చేశారు. 2014 లో కొత్తకోటను నియోజకవర్గ గా చేయాల్సి ఉండే కానీ చట్టసభల్లో కొత్తకోట తరపున గళం విప్పే నాయకుడు లేక కొందరి రాజకీయ ఒత్తిళ్లతో నియోజకవర్గంలో కాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లా తోపాటు దేవరకద్ర నియోజకవర్గంలో కొత్తకోట మండలం, పట్టణంలో అధిక జనాభా కలిగి ఉందని చెప్పారు. మదనపురం, అడ్డాకుల మండల లను కలుపుకొని లక్ష పైచిలుకు ఓటర్ జనాభా కలిగి ఉందని దీంతో కొత్తకోట ను సులువుగా నియోజకవర్గంగా ప్రకటించే అవకాశం ఉందని అన్నారు. మదనపురం మండలంలోని ప్రపంచంలోనే రెండవదిగా పేరుగాంచిన సరళ సాగర్ ప్రాజెక్టు మరియు, రామన్ పాడు ప్రాజెక్టు, రైల్వే స్టేషన్,శంకర సముద్రం రిజర్వాయర్, రాణి పేట లో ఉన్న రాజ్యసముద్రం, సంకిరెడ్డిపల్లి లో ఉన్న కృష్ణ సముద్రం, త్రాగునీరు సాగునీరుకు ఎలాంటి కొదవలేదని అన్నారు. నియోజకవర్గ ఏర్పడితే పర్యాటక కేంద్రాలుగా ఏర్పాటు అవుతాయని అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కొత్తకోటలో నేషనల్ హైవే తోపాటు భూమి విస్తరణ, ప్రపంచంలోనే పేరుగాంచిన చేనేత కార్మికులు, కలిగి ఉన్నాయని ఇన్ని సౌకర్యాలు ఉన్న కొత్తకోట ను నియోజకవర్గంగా ప్రకటించాలని లేని పక్షాన పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, మాజీ ఎంపీపీ గుంత మౌనిక, మాజీ జెడ్పిటిసి విశ్వేశ్వర్, మాజీ సి డి సి చైర్మన్ చెన్నకేశవరెడ్డి, కౌన్సిలర్ అయ్యన్న, ఎరుకలి తిరుపతయ్య, బిజెపి నాయకులు వనపర్తి శ్రీనివాస్ రెడ్డి, నిక్సన్, ప్రేమ దానం, రాములుయాదవ్, రాజారాం,సాయిరాం, షేక్ వహీద్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఎగ్జామినేషన్ పరీక్ష ప్యాడ్స్ అందజేత

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 9 (ప్రభాత ఉదయం)**



వార్షికోత్సవ పరీక్షలను పురస్కరించుకొని గురువారం ధరూర్ మండలం జాంపల్లి మండల ప్రాథమిక పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరుమాల రేవతి విద్యార్థులకు ఎగ్జామినేషన్ ప్యాడ్స్ అందజేశారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అందరు మంచిగా చదువుకొని పాఠశాలకు మంచి పేరు తీసుకరావాలి అని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ హెచ్ఎం బేగ్, విద్యార్థులు పాలొగొన్నారు.




## నార్సింగి సర్కిల్లో బుల్డోజర్ల హలచల్.. ఫుట్ పాత్ ఆక్రమణలను నిర్మాణాల కూల్చివేత

**గండిపేట,ఏప్రిల్09(ప్రభాత ఉదయం)**

నార్సింగి సర్కిల్ పరిధిలో రోడ్డు ఆక్రమణలపై మున్సిపల్ జీహెచ్ఎంసీ అధికారులు ఉక్కుపాదం మోపారు.గురువారం మొదటగా నార్సింగి లోని ఆర్కే గ్రాండ్ హోటల్ నుంచి పాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వరకు ఫుట్ పాత్ లపై ఏర్పాటు చేసిన నిర్మాణాలను రెండు జేసీబీలతో తొలగించారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ నుంచి నార్సింగి వైఎస్ఆర్ విగ్రహం వరకు రోడ్డుకు ఇరు వైపులా ఆక్రమణాలపై అధికారులు ఉక్కుపాదం మోపారు. నార్సింగి సర్కిల్ ఏసీపీ మనోహర్ ఆధ్వర్యంలో సుమారు 40 నిర్మాణాలను తొలగించారు. ఆక్రమణల తొలగింపు సమయంలో పలువురు అడ్డుపడటంతో ఉద్రిక్తత నెలకొంది.నార్సింగి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.ఫుట్ పాత్ లను ఆక్రమించి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి హెచ్చరించారు.బాధితులకు ఎలాంటి సమయం, నోటీసులు ఇవ్వకుండా తొలగించడం సబబు కాదని పలువురు బీజేపీ నేతలు మండిపడ్డారు.

## ఈనెల11న రాజేంద్రనగర్‌లో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు విజయవంతం చేయాలి: కృష్ణమాచారి

### మహాత్మజ్యోతిరావు పూలే జయంతి వేడుకలను విజయవంతం చేయాలి: ఉత్సవాల కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడుకృష్ణమాచారి

**రాజేంద్రనగర్,ఏప్రిల్09(ప్రభాత ఉదయం)**



మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నట్లు ఉత్సవాల కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణమాచారి తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... బహుజనుల,వెనుకబడిన వర్గాల కోసం మహాత్మా జ్యోతిబా పూలే చేసిన సేవలను గుర్తుంచుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.బిసి ఐక్యత కోసం పూలే తన జీవితాన్ని ధారపోశారని అన్నారు.సమాజంలోని అన్ని వర్గాలు జ్యోతిబాపూలే వారసత్వాన్ని ముందుకు తీసుకు పోవాలన్నారు.ఈనెల 11వ తేదీన రాజేంద్రనగర్ చౌరస్తాలో నిర్వహించే ఉత్సవాలలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్,చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి,మాజీ శాసనమండలి స్పీకర్ స్వామిగౌడ్,లు హాజరుకానున్నారని తెలిపారు.వేడుకలలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కిసాన్ న్యాయ సత్యాగ్రహ దీక్ష

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 9 (ప్రభాత ఉదయం)**

భారత్-యూఎస్ ట్రేడ్ డీల్ కి వ్యతిరేకంగా జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయభాను చిబ్ , మనీష్ శర్మ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి , భవ్య , రోషిని కౌనల్ జస్వాల్ వీరి సూచనతో కిసాన్ న్యాయ సత్యాగ్రహ దీక్షని రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో దీక్షలో ముఖ్య అతిథులుగా మొదటి వ రోజు సిడబ్ల్యుసి మెంబర్ , ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎన్ ఎస్ యు ఐ , యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు , మాజీ ఎమ్మెల్యే, పాలమూరు పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డాక్టర్ చల్లా వంశీ రెడ్డి , అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ , రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ చల్లా నరసింహారెడ్డి , ఫిషరీ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి పాల్గొన్నారు.దీక్షలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కె నాగేందర్ రెడ్డి , సంతోష్ గౌడ్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శిలు ,రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు ,కార్యదర్శులు అసెంబ్లీ అధ్యక్షులు , మండల అధ్యక్షులు, కార్యవర్గ కమిటీ సభ్యులు కూర్చోవడం జరిగింది అనంతరం దీక్షని విరమింపజేసిన మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి, కార్వాన్ నియోజవర్గ ఇన్చార్జ్ ఉస్మాన్ పాల్గొన్నారు.





## ఇంటింటికి సిపిఐ

### ప్రజా సమస్యల పరిష్కారమే సిపిఐ లక్ష్యం..

### పుస్తకాల నర్సింగ్ రావు

**రాజేంద్రనగర్,ఏప్రిల్09(ప్రభాత ఉదయం)**

ప్రజా సమస్యలపై సిపిఐ పార్టీ నిరంతరం పోరాడుతూనే ఉంటుందని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు అన్నారు. గురువారం మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడ,ఉడంగడ్డ ప్రాంతాలలో సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి సీపీఐ-ప్రజల వద్దకు సీపీఐ నినాదంతో నిధులను సేకరించారు.ఈ సందర్భంగా పుస్తకాల నర్సింగ్ రావు మాట్లాడుతూ...దేశానికి సీపీఐ పార్టీ కొత్తకాదని,దేశానికి స్వాతంత్ర్యం రాకుముందే ఆవిర్భవించిందన్నారు.శ్రమ శక్తి దోపిడీకి వ్యతిరేకంగా కార్మికులు,కర్షకులకు,కూలీలకు,బీసీ,ఎస్సీ,ఎస్టీ వర్గాలకు చెందిన బడుగుబలహీన వర్గాలకు ఆశాజ్యోతిగా సీపీఐ,అనుబంధ సంఘాలు వారి హక్కుల కోసం పోరాటాలు చేస్తోందన్నారు.దేశంలో పెరుగుతున్న ధరలు,నిరుద్యోగం,రైతుల కష్టాలు, విద్య ఆరోగ్య రంగాలలో సంక్షోభం ఇవన్నీ ప్రజల జీవితాలను కుదిపేస్తున్నాయన్నారు.ఈ నేపథ్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందని అన్నారు.దేశ సంపద కొందరి చేతుల్లోకి వెళ్తుందని దేశంలోని పేదలపైన పన్నులు,కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఉచితాలను అందిస్తుందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పానుగంటి పర్వతాలు, సిపిఐ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు జె.ఆనంద్ గౌడ్ మండల సహాయ కార్యదర్శి జె.విజయనందంగౌడ్,సత్యం,మునీశ్వరి కుకునూరు వాణి,సయ్యద్ ఖాజా,మహమ్మద్ సలీం, జె.సదానందంగౌడ్,సాబీర్,మౌనిక, జ్యోతి, ఊర్మిళ, బుజ్జి,కృష్ణ,లక్ష్మయ్య,కైలాసమ్మ,నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608